సాక్షి
నిర్మల్
ఆదివారం । 25 । జూన్ । 2023

ఆషాఢమొచ్చె.. ఆనందాలు తెచ్చె..!

ఆషాఢమాసం ప్రారంభమైంది. ఎన్నో ప్రత్యేకతలు, విశిష్టతలు ఈ మాసం సొంతం. శూన్య మాసమని వ్యవహరించినప్పటికీ ఎంతో నిండుదనాన్ని కలిగి ఉంటుంది. ఈ మాసంలో వచ్చే తొలి ఏకాదశితోనే పండుగలు ప్రారంభమవుతాయి. తెలంగాణ రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన బోనాల పండుగ ఈ మాసంలోనే నిర్వహిస్తారు. 8లో▸



గరిష్టం/కనిష్టం
31.6 /25.5

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణస్థాయికి చేరుకుంటాయి. గాలిలో తేమశాతం పెరుగుతుంది. చాలా ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

మహిళలకు అండగా 'సఖీ'



రైతులకు అవగాహన కల్పిస్తున్న సఖీ సిబ్బంది

పెంబి: ఇంటా, బయట వేధింపులు, లైంగిక దాడులు, ఇతర సామాజిక సమస్యలతో బాధపడే మహిళలకు సఖీ కేంద్రం అండగా నిలుస్తుందని లీగల్ కౌన్సిల్ అధికారి శరత్ అన్నారు. మండలంలోని లోతర్యతండా, తాటిగూడ, పుల్గంపాండ్రి గ్రామాలలో పంట చేనులో విత్తనాలు వేస్తున్న రైతుల వద్దకు వెళ్లి సఖీ కేంద్రంపై అవగాహన కల్పించారు. 181 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. స్త్రీలు ప్రధానంగా ఎదుర్కొనే వేధింపులు, గృహహింస, వరకట్న సమస్యలు, అక్రమ రవాణా, లైంగిక దాడులు వంటి సమస్యలు పరిష్కరించేందుకు సఖీ కేంద్రం కృషి చేస్తుందన్నారు. ఆయన వెంట పారామెడికల్ సిబ్బంది కవిత ఉన్నారు.

పాఠశాలల లైబ్రరీలకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందిస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి

నిర్మల్‌రూరల్: జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో నూతనంగా లైబ్రరీలను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఈ పాఠశాలలకు డీఈవో రవీందర్‌రెడ్డి అవసరమైన పుస్తకాలను సంబంధిత ఉపాధ్యాయులకు శనివారం అందించారు. జిల్లాలో మొత్తం 101 పాఠశాలలకు 10,592 పుస్తకాలు జిల్లాకు చేరుకున్నాయని తెలిపారు. వీటిని 72 ఉన్నత పాఠశాలలకు, 29 ప్రాథమికోన్నత పాఠశాలలకు పంపిణీ చేశామని పేర్కొన్నారు. ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 10 తరగతులకు 120 టైటిల్స్, ప్రాథమికోన్నత పాఠశాలలకు 6 నుంచి 8 తరగతులకు 74 టైటిల్లు గల పుస్తకాలు పంపిణీ చేశారు. వీటిని పాఠశాలల్లో విద్యార్థులకు లైబ్రరీ పీరియడ్‌లో చదివించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంవో నర్సయ్య, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

'ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీలపై ఐటీ దాడులు చేయాలి'

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ కాలేజీల్లో ఆదాయపు పన్ను శాఖ దాడులు చేస్తున్న తరహాలో ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీలపై దాడులు నిర్వహించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్ కోరారు. గత ఏడాది భారీ వర్షాల కారణంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు, కరోనా నష్టాల బాటలో మధ్య తరగతి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ప్రజలను ప్రైవేట్ విద్యా సంస్థలు ఇష్టానుసారం ఫీజులు వసూలు చేస్తున్నాయని వివరించారు. సూపర్ మార్కెట్ తరహాలో స్కూల్ బ్యాగ్స్, యూనిఫాం, షూస్, సాక్స్, బెల్ట్‌లు, పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, చివరకు పుస్తకాలకు వేసే పుట్టలు కూడా రశీదు లేకుండా అమ్ముతున్నారని వివరించారు. పేరెంట్స్ ఆన్‌లైన్ పేమెంట్ చేస్తామంటే ఒప్పుకోవడం లేదని, స్కూల్ పేరుతో రశీదులు ఇవ్వడం లేదని తెలిపారు. ప్రజల నుంచి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేస్తున్న ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీ యాజమాన్యాలు ప్రభుత్వానికి మాత్రం పన్ను ఎగ్గొడుతున్నాయని తెలిపారు.

టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ స్పాట్ ప్రారంభం



స్పాట్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో

నిర్మల్ రూరల్: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ జవాబు పత్రాల మూల్యాంకనం శనివారం జిల్లా కేంద్రంలో ప్రారంభమైంది. సోఫీనగర్‌లోని జేవీఎస్‌ఆర్ ఉన్నత పాఠశాలలో స్పాట్ కేంద్రాన్ని డీఈవో రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మూల్యాంకనం నిర్వహించారు. డీఈవో రవీందర్‌రెడ్డి, జిల్లా పరీక్షల అధికారి పద్మ, చీఫ్ కోడింగ్ ఆఫీసర్ అశోక్‌వర్మ కేంద్రాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. మూడు రోజులపాటు జరిగే ఈ స్పాట్‌లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 22,627 జవాబు పత్రాలను మూల్యాంకనం చేస్తారు. ముగ్గురు అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లు, 22 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 115 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 41 స్పెషల్ అసిస్టెంట్ సిబ్బంది ఈ మూల్యాంకనంలో పాల్గొంటారు. మూల్యాంకనం పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో సూచించారు.

41% వర్షాధారమే!

- 1.72లక్షల ఎకరాలకు వరుణుడే ఆధారం
- 1.53 లక్షల ఎకరాలకు నీటిపారుదల సౌకర్యం
- జిల్లాలో సాగునీటి వనరుల లెక్కతేల్చిన వ్యవసాయశాఖ



దుక్కి దున్నుతున్న రైతు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రకృతి వైపరీత్యాలు, మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పంటల సాగు సమయాన్ని ముందుకు తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. వానాకాలం ముందుకు జరిగితే యాసంగి పంటలు మార్చి నాటికి చేతికి వచ్చేలా సీజన్‌లను కుదించాలని నిర్ణయించింది. రైతులు వానాకాలంలో సాగునీటి వనరుల కింద సాధారణంగా జూన్ నుంచి నవంబర్ చివరి వరకు వర్షాధారంగా జూన్ నుంచి డిసెంబర్ వరకు పంటల సాగు చేపడుతున్నారు. దీంతో వేసవిలో వడగండ్ల వానలకు పంటలు దెబ్బతిని రైతులు నష్టపోతున్నారు. దీనిని గుర్తించిన ప్రభుత్వం క్షేత్రస్థాయిలో భూముల స్థితిగతులపై సర్వే చేయించింది. జిల్లాలో పంటల సాగుపై సమగ్ర వివరాలను పంపించాలని కోరడంతో వారం రోజులుగా క్లస్టర్ల వారీగా వ్యవసాయ విస్తరణ అధికారులు సర్వే చేస్తున్నారు.

సాగును ముందుకు జరిపేలా..

ఏటా అతివృష్టి, అనావృష్టితో పంటలకు నష్టం జరుగుతుండటంతో సాగు కాలాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు వీలుగా.. జిల్లాలో ఏయే పంటలు పండిస్తున్నారు, సాగునీటి సౌకర్యం ఎన్ని ఎకరాలకు ఉంది. వర్షాధారంగా ఎన్ని ఎకరాల్లో పంటలు సాగు చేస్తారనే సమాచారాన్ని ప్రభుత్వం కోరింది. వ్యవసాయ శాఖతోపాటు నీటిపారుదల, విద్యుత్ శాఖల భాగస్వామ్యంతో సర్వే పూర్తి చేయాలని ఆదేశాలు జారీ కావడంతో వారం రోజులు సర్వే చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కలెక్టర్ ఆమోదంతో ప్రభుత్వానికి నివేదించనున్నారు.

4.19 లక్షల ఎకరాల్లో సాగు...

జిల్లాలో మొత్తం 396 గ్రామాల పరిధిలో 79 వ్యవసాయ క్లస్టర్లు ఉన్నాయి. గతేడాది ఖరీఫ్‌లో మొత్తం 4.19 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఇందులో 1.72 లక్షల ఎకరాల భూమి వర్షాధారమని తేలింది. అంటే వరుణుడి కరుణ పైనే రెండో వంతు సాగుభూమి ఆధారపడింది. బోరు బావులు, కాలువలు, వ్యవసాయ బావులు, చెరువులు, కుంటల కింద మిగిలిన 2.47 లక్షల ఎకరాల భూమి సాగవుతున్నట్లు అధికారులు తేల్చారు.

క్లస్టర్ల వారీగా వివరాల నమోదు..

జిల్లాలో సాగునీటి వనరుల లెక్క తేలింది. వర్షాధారంతో సాగవుతున్న విస్తీర్ణం ఎంత, కాలువ కింద, ఎంత విస్తీర్ణంలో పంటలు పండుతున్నాయి? బోర్లు, వ్యవసాయబావుల కింద ఎంత మేరకు పంటలు వేసుకుంటున్నారు? చెరువులు, కుంటల ఆధారంగా ఏ మేరకు పంటలు సాగవుతున్నాయి వంటి అంశాలపై వ్యవసాయశాఖ లెక్కించింది. జిల్లాలో 79 వ్యవసాయ క్లస్టర్లు ఉన్నాయి. ఈనెల మొదటి వారంలో ఆయా క్లస్టర్లలో వనరుల వారీగా విస్తీర్ణాన్ని లెక్కించారు. ఈ వివరాలను రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన రైతుబంధు పోర్టల్లోని ప్రత్యేక పేజీలో నమోదు చేశారు. మండల వ్యవసాయ అధికారులు, అసిస్టెంట్ డైరెక్టర్లు ఈ లెక్కింపు ప్రక్రియను పర్యవేక్షించారు.

జిల్లా వివరాలు

జిల్లాలోని క్లస్టర్లు 79
గ్రామాలు 396
మొత్తం సాగు భూమి 4,19,350 ఎకరాలు
వర్షాధార సాగు 1,72,196 ఎకరాలు
నీటి పారుదల కింద సాగు 2,47,154 ఎకరాలు
జిల్లాలోని బోరు బావులు 56,437
బోరు బావుల కింద సాగయ్యే భూమి 1,53,800 ఎకరాలు
చెరువుల సంఖ్య 550
చెరువుల కింద సాగయ్యే భూమి 36,743 ఎకరాలు
వ్యవసాయ బావులు 10,837
వ్యవసాయ బావుల ఆధారంగా సాగయ్యే భూమి 22,793 ఎకరాలు
కాలువల కింద సాగయ్యే భూమి 26,201 ఎకరాలు
ఎత్తిపోతల పథకం కింద సాగయ్యే భూమి 7,617 ఎకరాలు

సమగ్ర సమాచారం సేకరించాం

ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల వారీగా వర్షాధారంతోపాటు సాగునీటి సౌకర్యంతో పండించే విస్తీర్ణం ఎంత అనే వివరాలు సేకరించాం. సీజన్ ప్రారంభం కాగానే పంటల వారీగా సమగ్ర సర్వే ఉంటుంది. ప్రస్తుతం రైతులతో అనుబంధంగా ఉండే అన్ని శాఖల సమన్వయంతో సర్వే వివరాలు నమోదు చేశాం. కలెక్టర్ అనుమతితో ప్రభుత్వానికి నివేదించాం.

– అంజిప్రసాద్,
జిల్లా వ్యవసాయశాఖ అధికారి

పానికి వనంతో కొయ్య బొమ్మల పరిశ్రమకు ఊతం

- డీఆర్డీవో విజయలక్ష్మి



పానికి వనం ఏర్పాటు చేసే ప్రదేశంలో బోరు బావి తవ్విస్తున్న అధికారులు, నాయకులు

సారంగపూర్: గోపాల్‌పేట్ గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన పానికి వనం ప్రఖ్యాతిగాంచిన నిర్మల్ కొయ్యబొమ్మల పరిశ్రమకు ఊతమిస్తోందని డీఆర్డీవో విజయలమి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని గోపాల్‌పేట్ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన పానికి వనంలో శనివారం బోరుబావి వేయించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మల్ కొయ్యబొమ్మల పరిశ్రమ కళాకారులకు పానికి కర్రను అందించాలన్న లక్ష్యంతో గోపాల్‌పేట్ గ్రామ శివారులో 2 వేల పానికి మొక్కలు నాటించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. వీటికి నీరందించడానికి ఉపాధిహామీ నిధులతో బోరుబావి వేయించామని తెలిపారు. ఈవనం పెరిగి పెద్దదయితే నిర్మల్ కొయ్యబొమ్మల పరిశ్రమకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. పానికి వనం రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాటిన మొక్కలను ప్రతి ఒక్కరూ రక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో సరోజ, ఏపీడీ వోస ప్రసాద్, ఏపీవో లక్ష్మారెడ్డి, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రఫీ, టీఏలు రజిత, లక్ష్మీకాంత్, ఎఫ్ఏ చంద్రకళ, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతుబంధుకు వేళాయె!

- ఈనెల 26 నుంచి రైతులకు పెట్టుబడి సాయం
- జిల్లాలో 1,89,317 మంది రైతులకు లబ్ధి
- కేటాయించే నిధులు రూ.228 కోట్లు



కుంటాలలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

లక్ష్మణచాంద: రాష్ట్రంలోని రైతుల కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా రైతులకు 24 గంటలు ఉచిత విద్యుత్ సరఫరా, సకాలంలో ఎరువులు, విత్తనాలు అందచేయడం, రైతులు పండించిన వివిధ రకాల పంటలను ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తోంది. పంటలు సాగుచేయడానికి పెట్టుబడి సాయంగా ఎకరాకు రూ.5 వేల చొప్పున రెండు పంటలకు రూ.10 వేలు చెల్లిస్తోంది. ఏదైనా కారణంతో రైతు మృతి చెందితే ఆ కుటుంబం రోడ్డున పడకుండా రైతుబీమా పథకం కింద రూ.5 లక్షల సాయం అందిస్తోంది. ఈ ఏడాది వానాకాలం పంటల సాగుకు సంబంధించిన పెట్టుబడి సాయం ఈనెల 26 నుంచి రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు కేసీఆర్ ఇటీవల ప్రకటించారు. దీంతో జిల్లా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 1,89,317 మందికి లబ్ధి..

జిల్లాలోని 19 మండలాలు 397 గ్రామాలలో రైతుబంధుకు గత పంటకు 1,71,290 మంది రైతులు అర్హులుగా ఉన్నారని డీఏవో అంజిప్రసాద్ తెలిపారు. అయితే బ్యాంక్ వివరాలు సరిగా లేని 86 మంది, పాత పట్టాదార్ పాస్‌బుక్‌లు ఉండి బ్యాంక్ అకౌంట్ సమర్పించని రైతులు 6,675 మంది, రైతు మృతితో ఆగిన రైతులు 1600, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ సరిగా లేని రైతులు 13 మంది, నూతన పట్టాపాస్ బుక్ ఉన్న రైతులు 9,653 మంది ఉన్నారని డీఏవో తెలిపారు. వివిధ కారణాలతో రైతుబంధు ఆగిన రైతుల వివరాలు పూర్తి చేస్తున్నామని పేర్కొన్నారు. మరో రెండు రోజుల్లో పూర్తి అవుతుందని వెల్లడించారు. జిల్లాలో అర్హులైన మొత్తం 1,89,317 మంది రైతులకు రైతుబంధు అందుతుందని తెలిపారు.

నిధులు రూ.220 కోట్ల నుంచి రూ.228 కోట్లకు పెంపు....

జిల్లాకు గతంలో రైతుబంధు పథకం కింద మొత్తం రూ.220 కోట్లు మాత్రమే వచ్చేవి. ఈసారి నూతనంగా పాట్టాపాస్ బుక్‌లు, వివిధ కారణాలతో ఆగిన వారి వివరాలు నమోదు చేయడంతో నూతనంగా 18,027 మంది రైతులు పెరిగారు. దీంతో ఈసారి జిల్లాకు రైతుబంధు కింద రూ.228 కోట్లు విడుదల కానున్నాయని డీఏవో అంజిప్రసాద్ తెలిపారు.

జిల్లా సమాచారం...

జిల్లాలో గత సీజన్‌కు రైతుబంధుకు అర్హులైన రైతులు 1,71,290
ఈసారి అదనంగా అర్హత పొందిన రైతులు 18,027
మొత్తం రైతుబంధు అందే రైతులు 1,89,317
జిల్లాకు రానున్న మొత్తం డబ్బులు రూ.228 కోట్లు

నేరుగా రైతుల ఖాతాల్లో జమ



రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఈ వానాకాలం పంటల సాగుకు ఇస్తున్న పెట్టుబడి సాయం ఈ నెల 26 నుంచి ప్రారంభం అవుతుంది. జిల్లాలో రైతుబంధుకు అర్హులైన రైతులు మొత్తం 1,89,317 మంది ఉన్నారు. జిల్లాకు రూ.228 కోట్లు రైతుల ఖాతాల్లో నేరుగా జ మ కానున్నాయి. మొదట ఒక గుంట భూమి ఉన్న రైతుల నుంచి ఎకరం లోపు భూమి ఉన్న రైతులకు జమ అవుతాయి. తరువాత మిగిలిన రైతులకు రోజు వారీగా చేస్తారు.

– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

గతం కంటే ఈసారి రూ.8 కోట్లు అదనంగా రానున్నట్లు పేర్కొన్నారు.

క్రీడా పాఠశాల పిలుస్తోంది

- రాష్ట్రంలోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లో స్కూళ్లు
- ప్రతీ పాఠశాలలో 80 మంది బాలురు, 80 మంది బాలికలకు అవకాశం
- 4, 5వ తరగతిలో ప్రవేశం
- జిల్లా, ఆపై రాష్ట్రస్థాయిలో ఎంపిక
- జూలై చివరి వారంలో అడ్మిషన్లు



నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్రంలోని మూడు క్రీడా పాఠశాల్లో 2023–24 విద్యా సంవత్సరానికి 4వ, 5వ తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఆసక్తిగల క్రీడాకారులు స్పోర్ట్స్ స్కూల్లో సీటుసాధిస్తే క్రీడారంగాన్ని శాసించేలా ఎదుగుతారనేది క్రీడా పాఠశాల లక్ష్యం. ఈనేపథ్యంలో స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశాలు ఎలా చేసుకోవాలి, ఎప్పుడు జరుగుతాయి, ఎలాంటి టెస్టులు పెడతారు. తదితర విషయాలపై కథనం.

ఎంపిక విధానం...?

రాష్ట్రంలోని మూడు ప్రాంతీయ క్రీడా పాఠశాలల్లో 2023–24 విద్యాసంవత్సరానికి 4వ, 5వ తరగతిలో ప్రవేశాలకు ఎంపిక పోటీల తేదీలను జిల్లాస్థాయి స్పోర్ట్స్ స్కూల్ అధికారులు ప్రకటించారు. మేడ్చల్ జిల్లాలోని హకీంపేటలో, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో క్రీడా పాఠశాలలు ఉన్నాయి. విద్యార్థులకు కొన్ని శారీరక సామర్థ్యంతోపాటు పలు టెస్టులు నిర్వహించి ఎంపికచేస్తారు. రాష్ట్రంలో మూడు స్కూళ్లు ఉండగా 40 మం ది (20 మంది 4వ తరగతి, 20 మంది 5వ తరగతి) బాలురు, 40 మంది (20 మంది 4వ తరగతి, 20 మంది) ప్రవేశాలు..'' 5వ తరగతి) బాలికలకు అవకాశం ఉంటుంది.

మండలస్థాయి పోటీలకు..

మండలస్థాయి ఎంపిక పోటీలకు హాజరయ్యే విద్యార్థులు పాఠశాల హెచ్‌ఎంతోపాటు మున్సిపాలిటీ, పంచాయతీకి సంబంధించిన వయస్సు ధ్రువీకరణ పత్రాలు వెంటతెచ్చుకోవాలి. రెండు పాస్‌పోర్టు ఫొటోలు 3వ, 4వ తరగతుల పాస్ సర్టిఫికెట్లతో మండలస్థాయి ఎంపిక పోటీలకు హాజరు కావాలి.

మండలస్థాయిలో ఎంపికలు...

జూలై 1 నుంచి 5 వరకు ఎంఈవో ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తారు. విద్యార్థులు శారీరక సామర్థ్య పరీక్షల్లో కనీసం 10 పాయింట్లు సాధిస్తే జిల్లాస్థాయికి ఎంపిక చేస్తారు.

- జూలై 9 నుంచి 15 వరకు జిల్లాల కేంద్రాల్లో జిల్లా క్రీడాశాఖ అధికారుల ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తారు. విద్యార్థులు శారీరక సామర్థ్య పరీక్షల్లో కనీసం 10 పాయింట్లు సాధిస్తే రాష్ట్రస్థాయికి పంపిస్తారు.

రాష్ట్రస్థాయిలో ఎంపికలు...

విద్యార్థులకు శారీరక సామర్థ్యానికి సంబంధించిన పరీక్షలు మండల, జిల్లాస్థాయిలో నిర్వహించి రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలకు పంపిస్తారు.. జూలై 24 నుంచి 30 వరకు హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తారు.

ఇవీ అర్హతలు..

4వ తరగతిలో ప్రవేశాల కోసం 01.09.2013 నుంచి 31.08.2014 మధ్య పుట్టి ఉండాలి. 5వ తరగతిలో ప్రవేశాలకు హాజరయ్యే విద్యార్థులు 01.09.2012 నుంచి 31.08.2013 మధ్య పుట్టిన వారు స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్‌లో పాల్గొనడానికి అర్హులు.

వీరు అనర్హులు..

దొడ్డి కాళ్లు, ఫ్లాట్‌ఫుట్, వెన్నెముక వంగి ఉన్న వారు. గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులు, బౌలెగ్స్ ఉన్న వారు. ఎక్కడైన ఎముకలు విరిగిన వారు అనర్హులు..

నిర్వహించే పరీక్షలు..

- ఎత్తు
- బరువు
- 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్
- స్టాండింగ్ బ్రాంప్
- 800 మీటర్ల రన్నింగ్
- 6,10 మీటర్ల షటిల్ రన్ –మెడిసన్ బాల్
- వర్టికల్ జంప్
- ఫ్లెక్సిబిలిటీ టెస్ట్
- మెడికల్ టెస్ట్

కౌశిక్‌రెడ్డిని బర్తరఫ్ చేయాలి

- తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం



నిరసన తెలుపుతున్న ముదిరాజ్ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ఎమ్మెల్సీ, శాసన మండలిలో ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డిని బర్తరఫ్ చేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ముదిరాజ్ యువజన మహాసభ అధ్యక్షుడు పాతర్ల హరీశ్, రాష్ట్ర నాయకులు బొజ్జ నారాయణ, శివయ్య డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో శనివారం కౌశిక్‌రెడ్డి ఫ్లెక్సీ దహనం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ముదిరాజ్ మహాసభ నేతలు మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్ జాతిని కించపరుస్తూ ఎమ్మెల్సీ చేసిన అసభ్యకర పదజాలాన్ని ఖండించారు. ముదిరాజ్ జాతిని అవహేళన చేసేలా మాట్లాడిన కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవికి అనర్హుడని పేర్కొన్నారు. హుజూరాబాద్‌లో ఈటల రాజేందర్‌ను రాజకీయంగా నేరుగా ఎదుర్కోలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. అమర వీరుల స్తూపాన్ని కూల్చివేసి కొత్త స్తూపాన్ని ఆవిష్కరించే క్రమంలో వీడియో కవరేజ్ చేస్తున్న జీఎస్‌ఆర్ టీవీ కెమెరామెన్‌పై దాడి చేయడాన్ని ఖండించారు. కౌశిక్‌రెడ్డిపై చర్య తీసుకోకపోతే రాష్ట్రంలో జరగబోయే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సారంగాపూర్ మండల అధ్యక్షులు బోండ్ల రమేశ్, నిర్మల్ జిల్లా యూత్ గౌరవ అధ్యక్షుడు బర్మ చిన్నయ్య, సారంపూర్ మండల నాయకులు దోడ నరసయ్య, బోండ్ల అనిల్, నిర్మల్ పట్టణ నాయకులు మందుల భీమేశ్, మందుల సతీశ్, నిర్మల్ మండల నాయకులు పోలీస్ భీమేష్, గొట్టం భీమేశ్, పిట్ల అనిల్, సోన్ మండల నాయకులు బర్మ శ్రీకాంత్, బర్మ రాములు, గుర్రం రాము, గుర్రం భీమన్న పాల్గొన్నారు.


స్పందించి.. రక్తం అందించి..



రక్తదానం చేస్తున్న పట్టణ సీఐ ఎల్.శ్రీను

భైంసాటౌన్: రక్తస్రావంతో బాధపడుతున్న ఓ మహిళకు రక్తదానం చేసి ఉదారత చాటుకున్నారు భైంసా పట్టణ సీఐ ఎల్ శ్రీను. ముధోల్ మండలం బ్రాహ్మణ్‌గావ్‌కు చెందిన పూజ భైంసాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతోంది. ఈ క్రమంలో శనివారం ఆపరేషన్ సమయంలో తీవ్ర రక్తస్రావం కావడంతో, సమాచారం అందుకున్న బ్లడ్ డోనర్స్ గ్రూపు అడ్మిన్ సురేశ్ వెంటనే రక్తదాతల కోసం బ్లడ్ డోనర్స్ వాట్సాప్ గ్రూపులో పోస్టు చేశారు. ఈ గ్రూపులో సభ్యుడిగా ఉన్న పట్టణ సీఐ ఎల్.శ్రీను వెంటనే స్పందించి రక్తదానం (బి పాజిటివ్) చేశారు. ఆపద సమయంలో రక్తదానం చేసినందుకు మహిళ కుటుంబీకులు సీఐకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటర్ విద్యార్థులకు జాబ్‌మేళా



సెలెక్ట్ అయిన విద్యార్థులతో ఫార్మా కంపెనీ సిబ్బంది

నిర్మల్ రూరల్: ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థుల కోసం ఎంఎస్ఎన్ ఫార్మ కంపెనీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాలలో శనివారం జాబ్‌మేళా నిర్వహించారు. ఇంటర్ పాస్ అయిన 28 మంది విద్యార్థులు ఈ మేళాకు హాజరయ్యారు. ఇందులో రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా 8 మందిని సెలెక్ట్ చేశారు. వీరికి త్వరలోనే శిక్షణ ఇచ్చి హైదరాబాదులో పోస్టింగ్ ఇస్తామని నిర్వాహకులు తెలిపారు. శిక్షణ సమయంలో ఒక్కొక్కరికి నెలకు రూ.11 వేల జీతం, భోజనం, వసతి ఇస్తామని, డిస్టెన్స్ ద్వారాపై చదువులు చదువుకునే అవకాశం కల్పిస్తామని వివరించారు.

26న పాఠశాలలు బంద్



మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఈనెల 26న రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు బంద్‌కు పిలుపు ఇస్తున్నట్లు ఏబీవీపీ జిల్లా కన్వీనర్ కైరి శశి తెలిపారు. స్థానిక ఏబీవీపీ కార్యాలయంలో శనివారం మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి పాఠ్య పుస్తకాలు, దుస్తులు సకాలంలో అందేలా చూడాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలపై చర్య తీసుకోవాలన్నారు. మనఊరు మనబడి కార్యక్రమాన్ని పారదర్శకంగా కొనసాగించి ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సాంఘిక సంక్షేమ హాస్టలల్లో మౌలిక వసతులు కల్పించి, అనుమతులు లేని ప్రైవేట్ పాఠశాలలపై చర్య తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఈ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా 26వ తేదీన బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇందూర్ విభాగ్ స్టూడెంట్ ఫర్ సేవ కన్వీనర్ చంద్రగిరి శివకుమార్, హాస్టల్ కన్వీనర్ దినేష్, రఘు, వంశీ పాల్గొన్నారు.

'బడిబాట' పొడిగింపు

నిర్మల్ రూరల్: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రభుత్వం పొడిగించింది. ప్రభుత్వ బడుల్లో కొత్తగా విద్యార్థులను చేర్పేందుకు బడిబాట కార్యక్రమాన్ని తీసుకువచ్చారు. ఇప్పటికే జిల్లాలో రెండు విడతల బడిబాట కార్యక్రమం ముగిసింది. అయితే ఈ నెల 26 నుంచి జూలై 6 వరకు మూడో విడత నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. రెండు విడతల్లో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 4 వేల మంది కొత్తగా అడ్మిషన్ పొందారని తెలిపారు. మూడో విడతలో మరింత మంది చేరేలా చూస్తామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఉరేసుకుని ఒకరు బలవన్మరణం


ఆస్పత్రిలో మృతదేహం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న ఓ చెట్టుకు వ్యక్తి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. శనివారం తెల్లవారుజామున గమనించిన స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని రిమ్స్‌లోని మార్చురీకి తరలించారు. మృతుడు మహారాష్ట్రకు చెందిన వ్యక్తా? లేక జిల్లాకు చెందిన వ్యక్తా? అనే కోణంలో పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. హత్యకోణంలో సైతం దర్యాప్తు చేస్తున్నారు. మృతుని పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి


కోరెంగా లక్కు(ఫైల్)

ఇంద్రవెల్లి(ఖానాపూర్): విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని వాల్గొండ గ్రామ పంచాయతీ పరిధిలోని పోల్లుగూడలో చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు, ఎస్సై సునీల్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కోరెంగా లక్కుపటేల్ (52) తన పంటచేనుకు వెళ్లి మినీ ట్రాన్స్‌ఫార్మర్(డీటీఆర్) పరిసర ప్రాంతంలో పిచ్చి మొక్కలు తొలగిస్తుండగా స్తంభానికి ఉన్న సపోర్ట్ వైర్‌ను తాకడంతో షాక్‌కు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఆటోలో ఇంద్రవెల్లి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృత్యుని భార్య లింగుబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో దూడ మృతి


మృతి చెందిన దూడ

కడెం(ఖానాపూర్): మండలంలోని అల్లంపల్లిలో విద్యుదాఘాతంతో దూడ మృతి చెందింది. గ్రామంలోని జోర్‌సింగ్ అనే రైతుకు చెందిన దూడ శనివారం గ్రామ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైరుకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. దూడ విలువ రూ. 35 వేలు ఉంటుందని, విద్యుత్ శాఖ తరఫున నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు. సమస్య పరిష్కరించాలని పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో మూడు నెలల్లో మూడు పశువులు మృతి చెందాయి. మరో దూడ మృతి చెందిన విషయం తెలవడంతో విద్యుత్ సిబ్బంది హుటాహుటిన గ్రామానికి చేరుకుని మరమ్మతులు చేయడం గమనార్హం.


చేతులకు గోరింటాకు చూపుతున్న మహిళలు, యువతులు

ఆషాఢమొచ్చె.. ఆనందాలు తెచ్చె..!

ఆషాఢమాసం ప్రారంభమైంది. ఎన్నో ప్రత్యేకతలు, విశిష్టతలు ఈ మాసం సొంతం. శూన్య మాసమని వ్యవహరించినప్పటికీ ఎంతో నిండుదనాన్ని కలిగి ఉంటుంది. ఈ మాసంలో వచ్చే తొలి ఏకాదశితోనే పండుగలు ప్రారంభమవుతాయి. తెలంగాణ రాష్ట్రంలో ఎంతో ప్రతిష్ఠాత్మకమైన బోనాల పండుగను ఈ మాసంలోనే నిర్వహిస్తారు. ఈ యేడు జూన్ 19న ప్రారంభమైన ఆషాఢం జూలై 17తో ముగియనుంది. ఎంతో ప్రాముఖ్యత ఉన్న ఆషాఢం గురించి కథనం..

– ఆదిలాబాద్/నిర్మల్‌ఖిల్లా

- పండుగల ఆరంభం ఈ మాసంలోనే..
- పర్వదినాలకు ప్రతీతి
- శుభకార్యాలకు మాత్రమే బ్రేక్

శూన్యమాసం...

తెలుగు సంవత్సరాల్లో నాలుగో నెల ఆషాఢం. పూర్వాషాఢ నక్షత్రంలో కూడిన పౌర్ణమి ఉన్న నెలయే ఆషాఢ మాసం. ఈ మాసంలోనే వర్షబుతువు ప్రారంభమవుతుంది. పౌర్ణమి రోజున చంద్రుడు ఉత్తరాషాఢ/పూర్వాషాఢ నక్షత్రాల సమీపంలోనికి వచ్చే నెలగా తెలియజేస్తారు. ఉత్తరాయన పుణ్యకాలం పూర్తయి సూర్యుడు మిథున రాశి నుంచి కర్కాటక రాశిలోకి ప్రవేశించడంతో దక్షిణాయనం మొదలవుతుంది. దక్షిణాయనం ప్రారంభమైన మాసం కనుక ఆషాఢ మాసం శూన్యమాసం. ఈమాసంలో గృహప్రవేశం వివాహం వంటి శుభకార్యాలు చేయకూడదని శాస్త్రాలు తెలియజేస్తున్నాయి. అయితే దేవతారాధనలకు, శక్తి ఆరాధనలకు ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉంటుంది.

పర్వదినాలు ప్రారంభం

ఆషాఢం అనే పదం 'ఆది' అనే సంస్కృత పదం నుంచి ఉద్భవించింది. ఆది అనగా శక్తి అనే అర్థాన్ని తెలియజేస్తుంది. కావున ఆషాఢ మాసంలో దేవతలను పూజించడం అనేది పరమ పవిత్ర కార్యమని భక్తులు విశ్వసిస్తారు. అందుకే ఈ మాసంలో పవిత్రమైన పూజలు, వ్రతాలు, రథయాత్రలు, పల్లకీసేవలు అధికంగా జరుగుతుంటాయి. దేశంలోని ప్రముఖమైన పూరి జగన్నాథుని రథయాత్ర సైతం ఆషాఢ మాసంలోనే జరగడం విశేషం. అందుకే ఈ నెలలో ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతూ ఉంటాయి. పండితులు పూజా కార్యక్రమాల్లో నిమగ్నమై ఉంటారు. తొలి ఏకాదశి నుంచి పండుగలు ప్రారంభమవుతాయి. ఆషాఢశుద్ధ ఏకాదశి రోజున మహావిష్ణువు పాలకడలిపై యోగనిద్రలోకి వెళ్లే సందర్భాన్ని తొలి ఏకాదశిగా వ్యవహరిస్తారు. ఆషాఢ శుద్ధపౌర్ణమి రోజున గురుపౌర్ణమిగా పరిగణిస్తారు. ఈ మాసంలో స్కంద పంచమి, 'దక్షిణాయన పుణ్యకాలం' కూడా ప్రారంభమవుతుంది. అంతేకాకుండా రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే బోనాల ఉత్సవాలు ఆషాఢంలోనే అంగరంగ వైభవంగా ఆరంభమవుతాయి. వర్షాకాలం రాకతో ఈ ఉత్సవాలు ప్రారంభం కావడం కొంత శాస్త్రీయతను సైతం కలిగి ఉంటాయి.

గోరింట మెరుపులు

గోరింటాకును అతివలు అమితంగా ఇష్టపడతారు. వాటిని తమ అరచేతుల్లో వేసుకుని ఎర్రగా పండితే మురిసిపోతారు. ఏ పర్వదినాలకైనా శుభ కార్యానికైనా గోరింటాకు ఉండాల్సిందే. ముఖ్యంగా ఆషాఢ మాసంలో గోరింటాకు ధరించడం అనేది ఆనవాయితీగా వస్తోంది. గ్రీష్మ రుతువు అనంతరం వర్ష రుతువులో ఆషాఢ మాసం వస్తుంది. ఈ సమయంలో గ్రీష్మ రుతువులో మన శరీరం వేడితో కూడుకుని ఉంటుంది. ఆషాఢంలో బయటి వాతావరణం చల్లబడిపోతుంది. ఈ కారణంగా గోరింటను అరచేతుల్లో ధరిస్తే శరీరంలోని వేడి బయట చల్లబడిన వాతావరణానికి విరుద్ధంగా తయారవుతుంది. చర్మ సమస్యలు కూడా దరి చేరవు. గోరింటాకు శరీరంలో ఉండే వేడిని తగ్గించే శక్తిని కలిగి ఉండడంతో పాటు రోగనిరోధక శక్తిని సైతం పెంచుతుంది. ఆషాఢంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం వలన సౌభాగ్యాన్ని పొందిన వారవుతారని జ్యోతిష్యులు తెలియజేస్తున్నారు.

అమ్మవార్లకు బోనాలు


బోనమెత్తిన మహిళలు, యువతులు

తెలంగాణలో బోనాలకు ఎంతో ప్రాశస్త్యం ఉంది. గ్రామం పట్టణం అనే తేడా లేకుండా ఎవరికి వారు ఎంతో ప్రత్యేకతలతో ఆషాఢ మాసంలో బోనాలు సమర్పిస్తారు. ముందుగా హైదరాబాద్ నగరంలో ప్రారంభమైన బోనాల పండుగ అనంతరం రాష్ట్రవ్యాప్తంగా వైభవంగా జరుపుకుంటారు. పూర్వకాలం నుంచి గ్రామ పొలిమేరలో ఉన్న అమ్మవార్లకు బోనాన్ని సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. బోనాల పండుగ నిర్వహణ వెనుక ఎంతో శాస్త్రీయత దాగి ఉంది. ఆషాఢమాసంలో వర్షాలు ప్రారంభమై కొత్త నీరు వచ్చి చేరడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఈ సందర్భంగానే బోనాల ఉత్సవాలు జరుగుతుంటాయి. బోనాల పండుగ నిర్వహణలో భాగంగా బోనం సమర్పించే సమయంలో ఘటాలకు వే పకొమ్మలు కట్టడం, ఇంటిని వేపకొమ్మలతో అలంకరించడం చేస్తుంటారు. వేప గొప్ప క్రిమిసంహారకంగా వ్యవహరిస్తుంది. ఆడపడుచులు తమ ఘటాలకు, పాదాలకు సైతం పసుపును రాసుకుంటారు. ఇది మంచి యాంటీబయాటిక్‌గా పనిచేస్తుంది.

అత్తారింటి నుంచి పుట్టింటికి..

కొత్తగా పెళ్లయిన అమ్మాయిలు ఆషాఢమాసంలో అత్తారింటి నుంచి పుట్టింటికి వెళ్తారు. ఆషాఢంలో అత్తాకోడళ్లు ఒకరినొకరు చూసుకోకూడదని సంప్రదాయబద్ధంగా వస్తోంది. కొత్తగా పెళ్లై అత్తారింట్లో అడుగిడిన అమ్మాయిలు తల్లిదండ్రులపై బెంగతో ఉంటారు. వీరు ఆషాఢమాసంలో పుట్టింటికి వెళ్లి తోబుట్టువులు, స్నేహితురాళ్లతో కలిసి వేడుకలు జరుపుకుంటారని ప్రతీతి.

మహిళలకు ప్రత్యేకం...



గోరింటాకు పెట్టుకోవడం మహిళలకు అమితమైన ఇష్టం. మా కాలనీలో మహిళలందరం కలిసి ఆషాఢమాసంలో గోరింటాకు పెట్టుకుంటాం. దీనివల్ల చర్మసౌందర్యంతో అనేక ప్రయోజనాలు ఉంటాయి. మా పూర్వీకుల నుంచి ఈ సంప్రదాయం కొనసాగుతోంది. అందరం కలిసి ఆనందంగా వేడుకల్లో పాల్గొంటాం. అమ్మవారికి పూజలు కూడా చేస్తాం.

– కొప్పుల భారతి, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, నిర్మల్

శాస్త్రీయంగా కూడా ప్రయోజనాలు



గోరింటాకును శాస్త్రీయ పరిభాషలో 'లావుసీనియా ఇనెర్మిస్'గా పిలుస్తారు. ఇది 'లైత్రేసియా' కుటుంబానికి చెందిన ఔషధ గుణాలున్న మొక్క. దీని లేత ఆకులను మెత్తగా నూరి మహిళలు చేతులు, అరచేతులు, పాదాలకు పెట్టుకుంటారు. దీనివల్ల చర్మ సౌందర్యంతో పాటు ఎదుటివారిని ఆకర్షించే వర్ణాన్ని కలిగి ఉంటాయి. దీన్ని చూర్ణంగా చేసి పెట్టుకోవడం వల్ల ఆకులోని వర్ణద్రవ్యం లోగల 'లావుసీన్' అనే రసాయనం ఆరిన తర్వాత ఎరుపు రంగును ఇస్తుంది. ఇందులో చర్మ రోగాలను నివారించే గుణాన్ని కూడా కలిగి ఉంటుంది.

– డాక్టర్ వెల్మల మధు, వృక్ష శాస్త్ర నిపుణులు, నిర్మల్

చర్మ సౌందర్యం ఇస్తుంది



గోరింటాకు పెట్టుకోవడం వల్ల చర్మానికి అందాన్నిస్తుంది. మేము మా శ్రీరామ మహిళా సంఘం సభ్యులమంతా కలిసి ఏటా ఆషాఢ మాసంలో గోరింటాకు వేడుకలు ఉత్సాహంగా జరుపుకుంటాం. లేలేత గోరింటాకు తెంపుకుని వచ్చి మెత్తగా నూరి చేతులపై విభిన్న రకాల డిజైన్లు వేసుకుంటాం.

– గన్నారపు అన్నపూర్ణ, నిర్మల్

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


సాయన్న మృతదేహం

సారంగపూర్(నిర్మల్): మండలంలోని ప్యారమూర్ గ్రామానికి చెందిన చందల నడిపి సాయన్న (53) శనివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం సాయన్న వ్యవసాయ కూలీ పనికి వెళ్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తనకున్న ఎకరంనర భూమిలో కొన్నేళ్లుగా దిగుబడి లేకపోవడంతో పాటు తన కుమార్తె వివాహానికి చేసిన అప్పులు అంతకంతకు పెరిగిపోయాయి. మొత్తం నాలుగు లక్షల మేర అప్పులు కావడంతో ఎలాతీర్చాలో తెలియక తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య పోసాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై కృష్ణ సాగర్‌రెడ్డి తెలిపారు.

పురుగుల మందుతాగి మహిళ ఆత్మహత్య


లక్ష్మీబాయి మృతదేహం

గుడిహత్నూర్(బోథ్): పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని వైజాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గోపాల్‌పూర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం తలమడుగు మండలం కుచులాపూర్‌కు చెందిన మడావి నాగోరావ్ తన కుటుంబంతో కలిసి వలస వచ్చి గోపాల్‌పూర్‌లో ఓ రైతుకు పాలేరుగా పనిచేస్తున్నాడు. నాగోరావ్ భార్య లక్ష్మీబాయి (50) కొంత కాలంగా మానసిక స్థితి బాగా లేకపోవడంతో ఇంటి వద్దే ఉంటోంది. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): ఈ నెల 21న రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మండల కేంద్రంలోని పాత ఉట్నూర్‌లో నివాసం ఉంటున్న సిడాం దేవేందర్ (35) ఈ నెల 21న రాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా తెలంగాణ చౌరస్తా వద్ద విద్యుత్ తీగలు తగిలి పడిపోవడంతో చికిత్స నిమిత్తం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. మృతుడు ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్సీలో విధులు నిర్వర్తిస్తుండేవాడు. మృతునికి భార్య అనురాధ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పరామర్శ

ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్‌తో పాటు ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత రాథోడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పటేల్, పలువురు ప్రముఖులు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

ఇంద్రవెల్లి(ఖానాపూర్): మండలంలోని దనోర(బి) గ్రామ పరిధిలోని ఓ రైతు వ్యవసాయ బావిలో శనివారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై డీ.సునీల్ తెలిపారు. శనివారం బావిలో మృతదేహాన్ని గమనించిన రైతులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించగా కుళ్లిపోయి గుర్తుపట్టకుండా ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉట్నూర్ ఆస్పత్రికి తరలించారు.

దాడికి పాల్పడిన నలుగురిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: దాడి చేసిన పలువురిపై ఆదిలాబాద్ టుటౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన తండ్రీకొడుకులు కమ్మల కిష్టు, రాజ్‌కుమార్ కిరాణ షాప్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. అదే కాలనీకి చెందిన వసీం, ఇమ్రాన్, వినోద్, వడ్డెర కాలనీకి చెందిన గుడ్డు శుక్రవారం రాత్రి షాపు ఎదుట మద్యం సేవిస్తున్నారు. దీంతో రాజ్‌కుమార్ షాపు ముందు వద్దని వారించడంతో వారిపై దాడి చేసి గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

శ్రీచైతన్య టెక్నో పాఠశాల సీజ్

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య టెక్నో పాఠశాలకు ఎలాంటి గుర్తింపు లేని కారణంగా విద్యాశాఖ అధికారులు శనివారం సీజ్ చేశారు. డీఈవో రవీందర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎంఈవో కస్తూరి శంకర్ పాఠశాలను తనిఖీ చేసి సరైన పత్రాలు గుర్తింపు లేని కారణంగా పాఠశాలకు తాళం వేసి సీజ్ చేశారు.

వ్యక్తి అదృశ్యం


నవీన్(ఫైల్)

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన బట్టి నవీన్ (35) ఈ నెల 15న తన అత్తమ్మను పంజాబ్‌లో ఉంటున్న బంధువుల ఇంట్లో దింపడానికి వెళ్లాడు. 20న పంజాబ్ లోని గంగానగర్ ఎక్స్‌ప్రెస్ రైలులో వస్తుండగా భోపాల్ వద్ద ఇంటికి ఫోన్ చేసి చివరిసారిగా మాట్లాడాడు. ఇప్పటి వరకూ తిరిగి రాకపోవడంతో అతని భార్య బట్టి పుష్పలత శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన సివిల్స్ ర్యాంకర్


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న భార్గవ్

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల విడుదలైన సివిల్స్ పరీక్ష ఫలితాల్లో 554వ ర్యాంకు సాధించిన జిల్లాకు చెందిన మద్దెల భార్గవ్ శనివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే జోగు రామన్నను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భార్గవ్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను సైతం ఘనంగా సత్కరించారు. యువతకు ఆదర్శంగా నిలిచేలా ఉన్నతంగా ఎదగడంతో ఎమ్మెల్యే జోగు రామన్న హర్షం వ్యక్తం చేశారు. అంకితభావంతో విధులు నిర్వర్తించి ప్రత్యేక గుర్తింపు సాధించాలని ఆకాంక్షించారు.

ఉత్తమ సేవ పురస్కార అవార్డుకు ఎంపిక


సుధీర్‌కుమార్

ఇచ్చోడ(బోథ్): మండలంలోని అడేగామ(కె) గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది సంగెం సుధీర్‌కుమార్ ఉత్తమ సేవ పురస్కార అవార్డుకు ఎంపికయ్యారు. తెలుగు భాషా సాంస్కృతిక శాఖ, సత్యసంగీత ఇంటర్నేషనల్, సేవా సంస్కృతి శాఖ ఆధ్వర్యంలో జూలై 1న హైదరాబాద్‌లోని త్యాగరాయగాన సభలో అవార్డు ప్రదానం చేయనున్నారు. కరోనా కాలం నుంచి ప్రతీ ఆదివారం పేదలకు నిరంతరం ఉచిత అన్నదానంతో పాటు సామాజిక సేవలు అందిస్తున్నారు.

ఆధారాలతో వస్తే బాబును అప్పగిస్తాం

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల ఇచ్చోడ మండలం సిరిచెల్మలో పాడుబడ్డ బావిలో గ్రామస్తులు గుర్తించిన పసికందును రక్త సంబంధీకులు ఆధారాలతో వస్తే అప్పగిస్తామని బాలల పరిరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్ తెలిపారు. రెండు నెలల్లోగా ఆధారాలతో రావాలని, లేదంటే బాలల సంక్షేమ సమితి బాలుడిని అనాథగా ధృవీకరిస్తుందని ఆయన పేర్కొన్నారు. వివరాలకు 8712659944, 9440555872లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

కూరగాయల సాగుపై శిక్షణ


అవగాహన కల్పిస్తున్న సందీప్‌కుమార్

ఉట్నూర్‌రూరల్: ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదేశాల మేరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నీటి వసతి కలిగిన గిరిజన పీవీటీజీ రైతులకు కూరగాయల విత్తనాలు పంపిణీ చేయడానికి సన్నద్ధం చేస్తున్నామని ఐటీడీఏ ప్రాజెక్టు హార్టికల్చర్ అధికారి గుడిమళ్ల సందీప్‌కుమార్ తెలిపారు. శనివారం పీవీటీజీ రైతులకు ఉద్యాన నర్సరీ, శిక్షణ కేంద్రం (హెచ్ఎన్‌టీసీ) ఉట్నూర్‌లో ప్రకృతి వ్యవసాయం, కూరగాయల సాగు, పండ్ల తోటల్లో అంతరపంటలుగా కూరగాయల సాగుపై ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్‌తో కలిసి అవగాహన కల్పించారు. రైతులు కూరగాయలు సాగుచేసి ఆర్థికంగా ఎదగాలని కోరారు. నర్సరీలో పెంచుతున్న మొక్కలపై అవగాహన కల్పించారు. ఉద్యాన అధికారి సుధీర్‌కుమార్, ఉమ్మడి జిల్లా పీవీటీజీ సూపర్‌వైజర్లు, 30 మంది పీవీటీజీ కొలాం, తోటి రైతులు పాల్గొన్నారు.

సీఆర్టీల నియామక పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు


మాట్లాడుతున్న డీడీ దిలీప్‌కుమార్

- జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.దిలీప్ కుమార్

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): నేడు జరుగనున్న సీఆర్టీల నియామక పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.దిలీప్‌కుమార్ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరీక్షకు 1,818 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఉట్నూర్‌లో 5 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు 30 నిమిషాలు ముందుగానే చేరుకోవాలని సూచించారు. బ్లూ, బ్లాక్ బాల్‌పెన్‌ను మాత్రమే వాడాలని, అందరూ పరీక్ష ప్యాడ్స్ వెంట తెచ్చుకోవాలని కోరారు. సెల్‌ఫోన్స్, కాలిక్యూలేటర్స్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష కేంద్రంలోకి అనుమతించరన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. సమావేశంలో ఏటీడీవోలు సౌజన్య, క్రాంతి, జిల్లా గిరిజన క్రీడల అధికారి కె.పార్థసారథి, జీసీడీవో ఛాయ, పీఎంఆర్సీ సభ్యులు గోవింద్‌రావు, దేవురావు, శంకర్, వేణుమాధవ్‌రెడ్డి, ఎగ్జామినర్లు ఉత్తం, వికాస్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అతిథి ఉపాధ్యాయుల నియామకానికి దరఖాస్తులు

పాతమంచిర్యాల: జిల్లాలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో అతిథి ఉపాధ్యాయులు, లెక్చరర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ సేరు శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంగ్లమాధ్యమంలో గణితం, ఫిజిక్స్, బోటనీ, జువాలజీ, సోషల్ సబ్జెక్టులు బోధించడానికి అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పీజీ, బీఈడీ పూర్తిచేసి ఉండాలన్నారు. తెలుగు, ఇంగ్లిష్, హిందీ సబ్జెక్టులకోసం పీజీ, బీఈడీ చేసి ఉండాలన్నారు. డెమో, ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని, అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 28లోగా బయోడేటాను ఎంజేపీలో అందజేయాలని సూచించారు. ఈ నెల 30న గుడిపేటలోని గురుకులంలో ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7993456620 నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తులు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలలో ఏర్పాటయ్యే మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల డిగ్రీ కళాశాలల్లో ప్రవేశంకోసం ఇంటర్ పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎంజేపీ విద్యాసంస్థల రీజినల్ కోఆర్డినేటర్ గోపిచంద్, మంచిర్యాల జిల్లా కన్వీనర్ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో www. mjptbcwreis. telangana. gov. in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

డిగ్రీ పరీక్షల్లో 20 మంది డిబార్

ఆదిలాబాద్‌టౌన్ : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జరుగుతున్న కేయూ డిగ్రీ పరీక్షల్లో శనివారం 20 మంది డిబార్ అయినట్లు పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్‌లోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఒకరు, లక్సెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలో 9 మంది, పూలాజీబాబా డిగ్రీ కళాశాలలో నలుగురు, అజ్మీరా రేఖనాయక్ కళాశాలలో ఒకరు, మంచిర్యాల విద్యానికేతన్ డిగ్రీ కళాశాలో ఇద్దరు, మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు చొప్పున డిబార్ అయినట్లు ఆయన పేర్కొన్నారు.